

## ఎనలాగస్ . . . .

ఎనలాగస్ అంటే ఏమిటన్న ప్రశ్నకు జవాబు బయాలజీ గ్రాడ్యుయేట్స్ నాలుక చివర ఉంటుంది.

వాట్ ఇజ్ మెంట్ బై ఎనలాగస్ ఆర్గాన్స్? అని ఇంగ్లీషు మీడియం వాళ్ళను అడిగితే, "ఆర్గాన్స్ విచ్ ఆర్ స్ట్రక్చరల్లీ అండ్ డెవలప్‌మెంటల్లీ డిస్సిమిలర్ బట్ ఫంక్షనల్లీ సిమిలర్ ఆర్ నోన్ యాజ్ ఎనలగస్ ఆర్గాన్స్" అని చెప్తారు.

అదే ప్రశ్న తెలుగు మీడియం వాళ్ళను తెలుగులో అడిగితే, "ఏ అవయవములలో పుట్టుక, పెరుగుదల, నిర్మాణము వేరు వేరుగా ఉండి చేసే పనులు మాత్రం ఒకే విధంగా ఉండునో ఆ అవయవములను క్రియాసామ్య (ఎనలాగస్) అవయవములు అంటారు" అని సమాధానం చెప్తారు.

హిందీ మీడియం వాళ్ళను అడిగితే ఏం చెప్తారో నాకు తెలీదు.

ఇక ఎనలాగస్ గురించి వదిలేసి కథ లోకి వెళ్దాం.

• • •

చీకటి పడుతోంది...

ఆషాఢం పూర్తై పోయిన వెంటనే అత్తావారింటికి పరుగుతీసే నూతన పెండ్లిలా గమ్యం దిక్కుకు పరుగు తీస్తోంది రైలు.

ఆ రైల్లో... ఒక కంపార్ట్‌మెంట్‌లో... అయిదుగురు కాలేజి స్టూడెంట్స్ ఉన్నారు. వాళ్ళల్లో ఇద్దరు ఆడవాళ్ళు, ముగ్గురు మగవాళ్ళు ఉన్నారు.

ఎదురెదురు రెండు బెంచీల మధ్యలో సూట్‌కేస్‌లు పెట్టి వాటి మీద పేక ముక్కలు పెట్టుకొని ఆడుతున్నారు పేకాట.

ఆ ఆట రాని అమాయకుడు రాజు కిటికీ దగ్గర కూర్చొని బయటకు చూస్తున్నాడు.

కిటికీలోంచి చల్లని గాలి రివ్వున తగిలి ఎంతో హాయిగా ఉంది. సూర్యుడు పడమటి కొండల పల్లో తన కిరణాలు కూడా పైకి రానంతగా చిక్కుకుని పోయాడు.

దగ్గరగా ఉన్న చెట్లు వేగంగా, దూరంగా ఉన్నవి నెమ్మదిగా పారిపోతున్నాయి. దూరం నుండి పట్నాల్లోని లైట్లు మిణుగురు పురుగుల్లా కనిపిస్తున్నాయి. వాటి వంక చూస్తూ కూర్చున్నాడు రాజా. దూరాన కన్పిస్తున్న లైట్లను, ఆవుర్లను చూస్తుంటే తనెవర్నో వదిలేసి ఎక్కడికో వెళ్ళి పోతున్నాన్న అనుభూతి కలుగుతుంది రాజుకి.

పేకాట ఆడుతున్న మిగిలిన మిత్ర బృందం నవ్వులూ మాట్లాడుకుంటున్న మాటలు, జోకులు నెమ్మదిగా వినబడుతున్నాయి. కానీ వాటినేం చెవిన పెట్టడం లేదు. అతని దారి, ధోరణి అంతా వేరు. చాలా కామ్‌గా ఉంటాడు.

అతనితో ఉన్న గుణాల్ని బుక్స్ కావాల్సినప్పుడు, పరీక్షలు దగ్గర కొస్తున్నప్పుడు ఎప్పుడూ స్తుతి స్తూంటారు ప్రవీణ్, శేఖర్.

ప్రవీణ్, శేఖర్ రాజుని ఫ్రెండ్‌షిప్ చేసుకున్న ఫ్రెండ్స్ వాళ్ళ (గరల్ ) ఫ్రెండ్స్ రాధ, రాగిణి.

# ఎనలాగస్

కోరుకొండ సత్యానంద్

ఈ అయిదుగురూ బి. ఎస్‌సి. సెకండియర్ పూర్తయి సెలవులు గడుపుతున్న మిత్రులు.

సెలవుల తర్వాత లలిత వాళ్ళ దగ్గరకు వచ్చింది కవర్లు పట్టుకొని. కవర్లో ఉన్న సారాంశం చెప్పి, వాటిని అందరికీ పంచిపెట్టింది.

"హాయ్! అలాగా? కంగ్రాచ్యులేషన్స్! తప్పకుండా వస్తాం! అయితే నువ్వప్పుడే పెద్ద దానివై పోతున్నావన్న మాట..." వయసు మీరిన పసిపిల్లలా అంది రాగిణి.

అందరూ "కంగ్రాచ్యులేషన్స్, తప్పకుండా వస్తాం!" అన్నారు... రాజు కూడా.

లలిత వెళ్ళిపోయింది.

"అప్పుడే ఏం కొంప మునిగిందో, పెళ్ళి చేసేసుకుంటోంది... ఆగలేక పోతుందేమో!" వ్యంగ్యంగా అంది రాధ.

దానికి అందరూ నవ్వారు, రాజు తప్ప.

పెళ్ళి దగ్గర పడింది.

గరల్ ఫ్రెండ్స్, బాయ్ ఫ్రెండ్స్ మాట్లాడుకున్నారు.

ఆరోజు రాజు కలిశాడు శేఖర్‌కు. పుసుక్కున పెళ్ళికి వెళ్తున్న సంగతి చెప్పేసి, "రారా!" అన్నాడు.

ఎలాగూ సెలవులు కదా అని రాజు కూడా బయలుదేరాడు. అందులోనూ లలిత మరీ మరీ చెప్పింది రమ్మని... లలిత చాలా మంచి అమ్మాయి. రాజుకు లలిత అంటే చాలా ఇష్టం.

గరల్ ఫ్రెండ్స్, బాయ్ ఫ్రెండ్స్ "మధ్యలో వీడెందుకు పానకంలో పుడక లాగా" అని అనుకున్నారు... కానీ అవసరం జ్ఞాపకం వచ్చి, తమ విషయాలన్నీ తెలిసిన వాడే కదా, పర్వాలేదు అని వూరుకున్నారు.

ఒక్కసారిగా నవ్వులు వినిపించి ప్రక్కకు తిరిగి చూశాడు రాజు.

"ఇదిగో, పీక్కోవాల్సిన జోకర్ ముక్క" చూపిస్తూ ప్రవీణ్‌తో అంది రాగిణి.

"ఇదిగో హోయ్ పీక్కోవాల్సిన కళావరు సెవెన్" అని ముక్క వేసి చూపించాడు ప్రవీణ్.

"ముందు డబ్బు లిలా ఇచ్చుకోండి..." అని చేతులు చాపి అందర్నీ అడిగింది ఆట గెలిచిన రాధ.

"ఏమే రాధా! నీ రాశి పెరిగిపోతోంది...." అంటూ రెండ్రూపాయల నోటు ఇచ్చింది రాగిణి.

ప్రవీణ్, శేఖర్ కూడా ఇచ్చేశారు.

మళ్ళీ నవ్వులు.....

రాగిణి, రాధ మగవారితో సమాన హక్కులు కావాలని వాదించి, వేధించి, గెలిచిన మొట్టమొదటి స్త్రీలుగా కన్పించారు రాజుకు.

"ఏం రాజూ, మాట్లాడ్డం లేదే? మునిలా కూర్చున్నావ్, నీకు బోర్‌గా ఉందా? నువ్వూ వచ్చి ఆడగూడదూ?" అంది రాగిణి.

ఆ మాట్లాడే తీరు మాట్లాడక పోతే బాగుండ దన్నట్టుగా మాట్లాడినట్టన్పించింది.

"నాకు పేకాట రాదు, రాగిణీ!" అన్నాడు రాజు నవ్వుతూ.

**నిరీక్షణ**

నది ఒడ్డున
ఎన్నోసార్లు నిలబడి
ఓ నావ కోసం
ఎదురుచూశాను
అప్పుడు –
నదియే నావగా
నిరీక్షణమే
జీవిత పరమావధిలా
నా ముందుకొచ్చి
నిలబడ్డాయి!

–కిరణ్ బాబు

"అయ్యో, మర్చేపోయాను... బుద్ధిలో బృహస్పతి, చదువులో సరస్వతివి కదూ!... సారీ, సరస్వతుడివి కదూ!"

ఆ మాటకు అందరూ నవ్వారు.

రాజు కూడా నవ్వాడు, చిన్నగా.

మళ్ళీ ఆటలో మునిగిపోయారు వాళ్ళందరూ. ప్రవీణ్ పేకముక్కలు పంచుతున్నాడు....

ప్రవీణ్‌ని చూస్తే ఆర్నెల్ల క్రితం ఒకరోజు, ఆదివారం... తను, ప్రవీణ్ రామకృష్ణా బీచ్‌లో మాట్లాడుకున్న మాటలు గుర్తు కొచ్చాయి రాజుకు.

"ప్రవీణ్! నువ్వు రాగిణిని ప్రేమిస్తున్నావా?" అమాయకంగా అడిగాడు.

అలా అడగడానికీ తగిన కారణం ఉంది. ప్రవీణ్, రాగిణి ఇద్దరూ ఎప్పుడూ కలిసి కాలేజీకి వస్తారు... వాళ్ళ ఇళ్ళు ఒకటి తూర్పున, మరొకటి పడమటన ఉన్నాయి. అంతేకాదు, సాయంత్రం పూట లాస్ట్ పీరియడ్ ఎగ్గొట్టి, ప్రవీణ్, రాగిణి, రాధ, శేఖర్, బీచ్‌కి వెళ్తారు. ఈ విషయం క్లాసందరికీ తెలుసు... అందరూ రకరకాలుగా చెప్పుకోవడం తెలుసు రాజుకు. కొన్ని సార్లు తనే స్వయంగా ఆలకించాడు. ఆ రకాలు అన్నీ హేళన, అపవాదులతో కూడుకొన్నవే!

రాజుకు వాళ్ళ మాటలు నచ్చలేదు. చరిత్రలో జరిగిన ఎన్నో ప్రేమ కథలు తెలుసు రాజుకు. ఇంకా పెద్ద పెద్ద రచయిత(త్రు)లు వ్రాస్తున్న ప్రేమ రసభరిత నవలలు కూడా చదువుతాడు.

అందుకే అందరూ ఎన్ని విధాలుగా చెప్పుకున్నా, రాజు మాత్రం అలా అనుకోలేదు. వాళ్ళల్లో ప్రేమ దేవత సాక్షాత్కరించింది రాజుకు రాజు అడిగిన ప్రశ్నకు ప్రవీణ్ వింతగా చూశాడు.

ఆ చూపులో "రాజూ! నీకూ ఇటువంటి విషయాలు తెలిసి పోయాయిరా?" అన్న హేళన ఉందిగానీ అది రాజుకు కన్పించలేదు.

"చెప్పరా! నే నంత పైవాడినా మొహమాట పడుతున్నావ్?"

"ఛ! నువ్వెలా పై వాడివౌతావురా? నేను, రాగిణి ప్రేమించుకున్న విషయం నీకూ తెలిసిపోయిందా అని ఆశ్చర్యపోతున్నా నంతే"

ఆ మాటకు చిన్నగా నవ్వాడు రాజు.

"అయితే నా దో చిన్న సలహా, ఏం అనుకోనంటే చెప్తాను..." అన్నాడు రాజు.

"చెప్పరా, నేనేమనుకుంటాను?"

"అయితే, విను... నువ్వేమో డిగ్రీ సెకండియర్ చదువుతున్నావ్! రాగిణి అంతే! నీ డిగ్రీ పూర్తయ్యే సరికి ఇంకో సంవత్సరం పడుతుంది... పూర్తి అయ్యాక ఎమ్మెస్సీ రెండు సంవత్సరాలు... ఎమ్మెస్సీ చదవకపోయినా బి. ఎస్సీ తరవాత ఉద్యోగం దొరకాలంటే చాలా కష్టం. ఉద్యోగం దొరకాలంటే కనీసం ఫస్ట్‌క్లాసైనా రావాలి. నువ్వు చదవకుండా ఇలా తిరిగితే చదువుతో పాటూ నీ భవిష్యత్తు కూడా పాడవుతుంది... ఉద్యోగం లేకుండా రాగిణిని పెళ్ళి చేసుకోడానికి అవకాశం ఉండదు...

రాగిణి, రాధ, శేఖర్‌ల కోసం ఎదురు చూస్తూ రాజు చెప్తున్న మాటల్ని ఆలకిస్తున్నాడు ప్రవీణ్.

"అందుచేత నువ్వు ఈ సంవత్సరం పాటూ తిరగకుండా జాగ్రత్తగా చదువుకొని, ఉద్యోగం చూసుకొని రాగిణిని పెళ్ళి చేసుకుంటే హాయిగా ఉంటుందని నా అభిప్రాయం... ఆ తరవాత మీరిద్దరూ హాయిగా ఉండొచ్చు..."

రాజు చెప్పిన చిన్న సైజు ట్యూషన్ ఆలకించి, పెద్దగా నవ్వాడు ప్రవీణ్.

ప్రవీణ్ ఎందుకు నవ్వుతున్నాడో అర్థంగాక అదోలా చూశాడు రాజు.

"ఒరే, పిచ్చి సన్నాసీ! ప్రేమకు చివరి రూపం పెళ్ళే అని ఎవరు చెప్పార్రా? మేమేమీ దేవదాసు, పార్వతి, రోమియో, జూలియట్లం కాదు... ప్రేమించడం జస్ట్ హాబీ... కాలేజీ చదువంటే పుస్తకాలు పట్టుకొని చదువుతూ కూర్చోడం కాదు, ప్రేమించడం పుస్తి కట్టడానికీ కాదు... యు నో! ఇన్ మై డిక్షనరీ లవ్ మీన్స్ ఎంజాయ్ సమ్‌టైమ్ విత్ ఎ బ్యూటిఫుల్ లేడీ!" విలాసంగా నవ్వాడు ప్రవీణ్.

'ఖంగు' తిన్నట్టయింది రాజుకు.

"అయితే ఈ విషయం రాగిణికి తెలుసా?"

"తెలియక పోవడమేమిటి? నేను ఒరిజినలైతే, రాగిణి ట్రూ కాపీ... రాగిణి మన్నీ నా భావాలే. మేమే కాదు, రాధ, శేఖర్ కూడా అంతే!"

ఒక్కసారి గుండాగినట్లయింది రాజుకు.

"అదిగో, శేఖర్ వాళ్ళు వస్తున్నారు... వస్తానూ" అంటూ భుజం తట్టి వెళ్ళిపోతున్న ప్రవీణ్ వైపే తుళ్ళి పడి చూస్తూ ఉండిపోయాడు రాజు.

రాత్రి ఎనిమిది గంటలయింది.

రైలు ఒక స్టేషన్లో ఆగింది.

అందరూ సూట్‌కేస్‌లు పట్టుకొని దిగి పోయారు.

పెళ్ళి వారి ఇంటికి వెళ్ళగానే లలిత వాళ్ళ నాన్న గారు అందరికీ ఒక రూమ్ ఏర్పాటు చేశారు. [illegible] స్నానపానాదులకి వెళ్ళారు.

భోజనాలు పూర్తయ్యాయి.

"ఈ వూళ్ళో ఎగ్జార్సిస్ట్ ఆడుతుంది—వెళ్దామా" అని అడిగాడు రాజు మిగిలిన వాళ్ళను.

"సరే, నడవండి, వెళ్దాం. ఎలాగూ ముహూర్తం తెల్లవారుజామున కదా!" అన్నాడు శేఖర్.

అందరూ బయలు దేరారు.

టైమింకా గంట ఉన్నా, హాలంతా కిటకిటలాడి పోతూంది జనంతో.

"బాప్‌రే! ఇంత జనం ఉన్నారు, టికెట్స్ దొరుకుతాయా?" గుండె మీద చేయి పెట్టి ఆశ్చర్యంగా అంది రాధ.

"ఫర్వాలేదు... దొరుకుతాయి..." అన్నాడు రాజు.

రాజు, శేఖర్ టికెట్స్ బుకింగ్ దగ్గరకు నడిచారు.

ప్రవీణ్ పరుగున వెళ్ళి రెండు పది రూపాయల నోట్లిచ్చాడు రాజుకు. "ఫరవాలేదు...నేను తీస్తాన్లే... నా దగ్గరున్నాయి..." అన్నాడు రాజు.

"ఉంటే ఉండనియ్యిలే!" అని బలవంతంగా జేబులో కుక్కాడు రాగిణి, రాధ చూస్తుండగా.

రాజు, శేఖర్ ఇద్దరూ క్యూలో నిల్చున్నారు.

ప్రవీణ్, రాగిణి, రాధ కొద్ది దూరంలో నిల్చొని మాట్లాడుకుంటున్నారు.

అప్పుడు ఫస్ట్‌షో వదిలారు. జనం అంతా గుమ్ముగా వచ్చేశారు.

శేఖర్, రాజు ఆ సినిమా గురించి మాట్లాడు కొంటున్నారు. రాజు చెప్తున్న మాటల్ని యాంత్రికంగా ఆలకించి వూకొడుతున్నాడు తప్ప శేఖర్ దృష్టి అక్కడ లేదు. ఆ విషయం గమనించని రాజు ఏదో మాట్లాడేస్తున్నాడు.

పావు గంట గడిచింది.

బుకింగ్ ఓపెన్ చేశారు. క్యూ నెమ్మదిగా కదులుతోంది.

అంతలో ప్రవీణ్ అక్కడకు వచ్చి, 'శేఖర్! నిన్ను రాధ పిలుస్తోంది... నువ్వెళ్ళు, నేను నుంచుంటాను...' అని క్యూలో నిల్చున్నాడు.

శేఖర్ అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

"రాజూ! టికెట్స్ దొరుకుతాయంటావా?"

"ఫర్వాలేదు — దొరుకుతాయి... దొరక్కపోతే వెనక్కి వెళ్ళిపోదాం, దానికేముంది?" అన్నాడు రాజు.

ప్రవీణ్ ఏమీ మాట్లాడలేదు.

అయిదు నిముషాల తరవాత శేఖర్, రాధ, రాగిణి కలసి అక్కడికి వచ్చారు.

"రాధ సినిమాకు రాదట..." చావు కబురు చల్లగా చెప్పాడు శేఖర్.

"ఏం?" అని అడిగాడు రాజు.

"అమ్మో! ఈ సినిమా చాలా భయంకరంగా ఉంటుందట... అందులోనూ స్టీరియో సౌండ్... సెకెండ్ షో... చచ్చినా నేను రాను, బాబోయ్! నా కసలే భయం!" అన్నీ వంకర్లు తిరిగిపోతూ అంది రాధ.

"[illegible] రాగిణి.

"పోనీలేరా. వాళ్ళు రామంటున్నారు కదా. మనం ముగ్గురం వెళదాం—వాళ్ళు ఇంటికి వెళ్ళి పోతారు . . ." అన్నాడు శేఖర్.

"అయ్య బాబోయ్. మేం అక్కడికి వెళ్ళం. మనందరం ఇక్కడ ఎక్కడైనా రూమ్ తీసుకుని ఉందాం. అంతగా వెళ్ళాలనుంటే నువ్వు సినిమాకు వెళ్ళు, రాజూ" అంది రాధ.

## నా మాట విను

నువ్వెప్పుడూ అలా
నిరాశతో, నిస్పృహతో
తిరుగుతుంటా వెందుకు?
బాధ పడుతుంటా వెందుకు?
నా మాట విను
కాసేపు అలా తోటలోకి వెళ్ళు.

అక్కడి పూలచెట్లు, పళ్ళచెట్లు
నిన్ను ఆదరిస్తాయి, ఓదారుస్తాయి
నీ కేదో ఆశను కలిగిస్తాయి
నీ జీవితాన్ని వెలిగిస్తాయి.

అప్పుడు నువ్వు
తోటలోంచి తిరిగి వస్తావు—
ఎంతో ఆశతో, ఆనందంతో
ఏదో కర్తవ్యంతో.

—జి. వెంకటేశ్వర్లు

"అవునురా. మేం నలుగురం ఇక్కడ లాడ్జ్‌లో రూమ్ తీసుకుని ఉంటాం. నువ్వు సినిమాకు వెళ్ళు. పెళ్ళి టైమ్‌కు డైరెక్ట్‌గా అక్కడికి వచ్చేస్తాం. నువ్వెళ్ళి వాళ్ళిచ్చిన రూమ్ లాక్ తీసుకుని పడుకో" అంటూ జేబులోంచి లాక్ తీసి రాజు కిచ్చాడు ప్రవీణ్.

రాజుకు ఏమనాలో తోచలేదు.

"సరేలే, వెళ్ళండి. . ." అన్నాడు.

ఆ మాటకు వాళ్ళల్లో లోలోపల ఎంతో సంతోషం పొంగింది.

చక్కగా నలుగురూ వెళ్ళి పోయారు.

వాళ్ళాడిన నాటకానికి రాజుకు నవ్వొచ్చింది.

పెళ్ళి వారి దృష్టిలో సినిమాకు వెళ్ళినట్టు, రాజును తప్పించుకోవడానికి ఆడిన నాటకం అది.

రాజు టికెట్ తీసుకుని సినిమాకు వెళ్ళిపోయాడు.

పన్నెండు దాటాక సినిమా వదిలారు.

నీరసంగా, మత్తుగా ఉండడం వల్ల అక్కడున్న హోటల్లోకి దారి తీశాడు రాజు. ఇంత రాత్రి పూట కూడా ఆ హోటలు తెరిచి ఉందేమా అని ఆలోచించాడు. ఇంత రాత్రి అయినా అక్కడ జనం ఇంకా ఉన్నారు. స్ట్రాంగ్ టీ చెప్పి కూర్చున్నాడు బయటకు చూస్తూ. ప్రవీణ్ వాళ్ళు సినిమా హాలు దగ్గరకు వస్తారేమో అనుకున్నాడు. 'డైరెక్ట్‌గా పెళ్ళివారింటికి వచ్చేస్తాం' అన్న మాట జ్ఞాపకం వచ్చింది.

రాజు కింకా వాళ్ళాడిన నాటకమే జ్ఞాపకం వస్తుంది.

టీ తాగి బయటకు వచ్చాడు. సినిమా జనం అంతా వెళ్ళి పోయారు. సినిమా హాలు లైట్లు ఆర్పివేశారు. ఆ ప్రదేశమంతా నిశ్శబ్దంగా ఉంది. రిక్షా కోసం చుట్టూ చూశాడు. ఒక ఫర్లాంగు దూరంలో రిక్షా స్టాండు ఉంది. అక్కడ నాలుగు రిక్షాలున్నాయి.

అక్కడకు నెమ్మదిగా నడక మొదలు పెట్టాడు.

రిక్షా స్టాండు కొంచెం దూరంగా ఉండగా ఒక రిక్షా తన పక్కగా వెళ్ళింది. ఆ రిక్షా స్టాండు దగ్గర ఆగింది. అందులోంచి ఒక అమ్మాయి దిగింది. ఆ అమ్మాయి తెల్ల చీర కట్టుకుంది. మల్లె పూలు పెట్టుకుంది. మనిషి అందంగానే ఉంది.

స్టాండు దగ్గర ఆగి ఉన్న ఒక రిక్షాలో కూర్చున్న ఒక ఆసామీ గభాలున లేచి "ఇంతాలస్యం అయిందే? నే వొచ్చి అరగంట దాటింది—తెలుసా?" అన్నాడు ఆ అమ్మాయి వీపు చరుస్తూ.

ఆ అమ్మాయి ఒక నవ్వు నవ్వింది, "చాల్లే సరసం" అంటూ.

"పద. . . పద. . ." ఆ అమ్మాయి భుజం మీద చేయి వేసి రిక్షా వైపు నడిచాడు అతను.

వెళ్ళి పోతున్న రిక్షా వైపు చూస్తూ స్టాండు చేరుకున్నాడు రాజు.

"ఏగా క్కాడా తెప్పించుకుంటారా, బాబూ" అన్న మాట వినిపించి అటు చూశాడు. రిక్షా వాడు అదోలా నవ్వుతూ కన్పించాడు.

ఆ నవ్వును పట్టించుకోకుండా "మెయిన్ రోడ్డుకు పోనియ్" అని రిక్షా ఎక్కాడు రాజు.

రిక్షాలో కూర్చున్నా, రాజు మనసు ఆ అమ్మాయి మీదే. ఇంత అర్ధ రాత్రి వేళ ఒక ఆడది పాపం... కడుపు కోసం ఒళ్ళు అమ్ముకుంటుంది. . .ఆమె అలా తయారు కావడానికి కారణం ఎవరు? తనకు తనే ప్రశ్నించుకున్నాడు.

ఆమె పెరిగిన పరిసరాలు, పరిస్థితులు ఆమెన్ని అలా మార్చాయి అనుకున్నాడు.

వెంటనే రాజు స్మృతిపథంలో ఏదో మెదిలింది.

అతని కళ్ళ కెదురుగా ఆ అమ్మాయి, రాగిణి, రాధ, ఆ ఆసామీ, ప్రవీణ్, శేఖర్ మార్చి, మార్చి కనిపిస్తున్నారు.

ఎందుకో 'ఎవలాన్స్' అన్న పదం తనలో తనే అస్పష్టంగా గొణుక్కున్నాడు.

రిక్షా మెయిన్ రోడ్డు వైపు మళ్ళింది. *